క్లుప్తంగా

160 మందికి ఇంటర్‌లో అడ్మిషన్లు

చీరాల అర్బన్: చీరాలలోని ఏపీ మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం అర్హత సాధించిన వారి వివరాలను విడుదల చేశామని ప్రిన్సిపాల్ జె.సరళ శుక్రవారం తెలిపారు. ప్రతిభ, రోస్టర్ ఆధారంగా మొత్తం గ్రూప్‌కు 40 సీట్లు చొప్పున 160 మందికి అడ్మిషన్లు ఇచ్చామన్నారు. అర్హత సాధించిన విద్యార్థుల వివరాలను స్కూల్ నోటీస్ బోర్డులో ఉంచామన్నారు. ఎంపికైన విద్యార్థులు కాలేజీలో చేరవచ్చని, పూర్తి వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణ పుట్టినరోజు వేడుకలు



మజ్జిగ పంపిణీ చేస్తున్న కృష్ణమోహన్, తదితరులు

చినగంజాం(పర్చూరు): మండలకేంద్రం పర్చూరులో సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. దేవరపల్లికి చెందిన కృష్ణ వీరాభిమాని తోకల కృష్ణమోహన్ శుక్రవారం స్థానిక బొమ్మలసెంటర్‌లో రోటరీక్లబ్ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వెయ్యి మంది ప్రయాణికులకు, పాదాచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కృష్ణ పుట్టినరోజుతో పాటు ఆయన అభిమాని తోకల కృష్ణమోహన్ పుట్టినరోజు కూడా ఒకే రోజు కావటం విశేషం. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగబైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సభ్యులు గడ్డిపాటి శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న, తులసి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ కారక ఉత్పత్తులతో నష్టం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి

చీరాల రూరల్: క్యాన్సర్ కాకర ఉత్పత్తులైన పొగాకు, గుట్కాలు, ఖైనీలు, సిగరెట్, పాన్‌మసాలాలతో తీవ్ర దుష్పరిణామాలు ఎదుర్కోవాలని ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నాగళ్ల ప్రదీప్ కుమార్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలు హెచ్‌సి జీఎంఎస్‌ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఏకైక ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్న హాస్పిటల్ ఒక్క ఒంగోలు జీఎంఎస్‌ఆర్ ఒక్కటేనని తెలిపారు. క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరూ హాస్పిటల్‌కు వచ్చి ఉచితంగా పరీక్షలు చేయించుకుని మందులు వాడుకొని ఆరోగ్యవంతులుగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో శరత్‌బాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన లారీ

సంతమాగులూరు (అద్దంకి): అదుపు తప్పిన లారీ బైకు రిపేరు దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈఘటన మండలంలోని సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలో శుక్రవారం జరిగింది. అందిన వివరాల మేరకు కొమ్మాలపాడు వైపు నుంచి అడ్డరోడ్డు వైపునకు వెళ్తున్న లారీ కొమ్మాలపాడు గ్రామం వద్ద అదుపు తప్ప రోడ్డు పక్కనే ఉన్న బైకు మెకానిక్ షెడ్‌లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో షెడ్‌లో ఎవరూ లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దాంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న త్రిమూర్తులు

అద్దంకి రూరల్: విద్యార్థులు జంక్ ఫుడ్ మానివేసి ప్రతి రోజు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని మారెళ్ల పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ కేపీ రాజు అన్నారు. శుక్రవారం జనవిజ్ఞాన వేదిక అద్దంకి డివిజన్ ఆధ్వర్యంలో అద్దంకిలో జరిగిన సమ్మర్ కిడ్స్ క్యాంపు ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్ష చేసి ఐరన్ టానిక్ పంపిణీ చేశారు. జనవిజ్ఞాన వేదిక బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శితంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లోని అంతరంగిక నైపుణ్యాన్ని వెలికితీసేందుకు సమ్మర్ క్యాంపు దోహదపడిందన్నారు. అనంతరం విద్యార్థులకు మన్నం త్రిమూర్తులు మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో కావూరి ధనలక్ష్మీ, తంగిరాల వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



వీరాంజనేయులు దంపతులను సత్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు



సువర్ణజ్యోతి దంపతులను సత్కరిస్తున్న కారంచేడు వైద్య సిబ్బంది

చీరాల అర్బన్: అంకిత భావంతో పనిచేసిన వారు ఎప్పటికి గుర్తుండిపోతారని ఎమ్మెల్సీ కేఎస్‌ఎస్ లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని విఠల్‌నగర్‌లో గల ఎస్‌ఏఆర్‌ఆర్‌ఎం హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు, యూటీఎఫ్ సీనియర్ నాయకులు కె.వీరాంజనేయులు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, యూటీఎఫ్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, పలువురు యూటీఎఫ్ సీనియర్ నాయకులు హాజరయ్యారు. 38 సంవత్సరాలు పాటు ఉపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులుగా కొమ్మూరి వీరాంజనేయులు విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. అనంతరం కొమ్మూరి వీరాంజనేయులు-పద్మావతి దంపతులను ఘనంగా సత్కరించారు.

కారంచేడు: ప్రతి ఉద్యోగికి వారు పనిచేసిన శాఖలో ఎన్నో ఒడిదుడుకు ఎదుర్కొంటారని, ఉద్యోగ విరమణ అనంతరం వారి శేషజీవితం సుఖ సంతోషాలతో ఉండాలని వైద్యాధికారులు అన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఏఎన్‌ఎం నుంచి పీహెచ్‌ఎన్ వరకు వివిధ హోదాల్లో పనిచేసి రిటైర్మెంట్ అయిన జక్కుల సువర్ణజ్యోతి దంపతులను కారంచేడు కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కారంచేడు, స్వర్ణ, దగ్గుబాడు పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ జెస్సీ రాణి, డాక్టర్ ఉషా, డాక్టర్ సురేష్, డాక్టర్ షాలినీ, డాక్టర్ హస్నప్రియ, డాక్టర్ స్రవంతిలు పాల్గొని సువర్ణజ్యోతి అందించిన సర్వీస్‌లను కొనియాడారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు మల్లిఖార్జున రావు, వరలక్ష్మి, పీహెచ్‌ఎన్ రూతమ్మ, హెచ్‌వీలు వీరమ్మ, శ్రీనివాసరావు, సుధాకర్, బయ్యా శంకర్, సుబ్బారావు, ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రమేశ్‌బాబు సేవలు ప్రశంసనీయం



రమేశ్‌బాబు దంపతులను సత్కరిస్తున్న ఆదిలక్ష్మి

బల్లికురవ: 34 సంవత్సరాల పాటు ఒకే గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా పనిచేస్తూ పాఠకుల మనసులో రమేశ్‌బాబు చెరగని ముద్ర వేశారని ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రంథాలయ సెక్రటరీ కాసు ఆదిలక్ష్మి అన్నారు. బల్లికురవలోని శాఖా గ్రంథాలయంలో లైబ్రరియన్‌గా పనిచేస్తున్న అడ్డగడ రమేశ్‌బాబు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన సేవలను ప్రశంసిస్తూ రమేశ్‌బాబు దంపతులను ఆమె దుశ్శాలువాతో సత్కరించారు. శేష జీవితాన్ని పాఠకులకు సేవలందిస్తూ ఉండాలని గ్రామస్తులు కోరారు. విశ్రాంత గ్రంథపాలకుడు బృందావనం లక్ష్మీనాథ్, చుండూరి సుగుణరావు, పీ రామారావు, శామ్యూల్ మహేశ్వరరావు ఆయన సేవలను కొనియాడారు.

చందన అలంకారంలో వీరాంజనేయస్వామి



చందనాలంకారంలో ఆంజనేయుడు



ఏకాహం నిర్వహిస్తున్న భక్తులు



నక్కబొక్కలపాడులో..

చీరాల అర్బన్: హనుమజ్జయంతి ఉత్సవాలను పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని బోస్‌నగర్‌లో గల వీరాంజనేయస్వామి దేవాలయంలో ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వీరాంజనేయస్వామికి చందనంతో అలంకారం చేశారు. అనంతరం అరటిపండ్లతో సహస్ర నామార్చన నిర్వహించారు. ఉదయం విష్వక్సేన పూజ, పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం పేరాల నటరాజ నాట్య కళానిలయం వారిచే భరత నాట్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం హనుమజ్జయంతి సందర్భంగా స్వామివారికి సింధూరంతో, తమలపాకులతో సహస్ర నామార్చన, పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్తలు బొలిశెట్టి సీతారామాంజనేయులు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, నరసింహస్వామి, సీతారామాంజనేయులు, రమేష్‌బాబు తెలిపారు. జూన్ 3వ తేదీ వరకు పూజా కార్యక్రమాలు జరుగుతాయని అర్చకులు తమిరిశ శ్రీనివాస చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో భక్తులందరూ హాజరుకావాలని ఆయన కోరారు. అలానే పాపరాజుతోటలోని వీరాంజనేయ స్వామి దేవాలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. శుక్రవారం విఘ్నేశ్వరపూజ, వీరాంజనేయస్వామికి పంచామృత అభిషేకం, 108 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు.



శింగరకొండలో హనుమజ్జయంతి వేడుకల్లో దేవస్థాన ఏసీ సుభద్ర

హనుమజ్జయంతి వేడుకలకు అంకురార్పణ

బల్లికురవ: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో వేంచేసివున్న ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలకు శుక్రవారం అంకురార్పణ చేశారు. ఆలయ ధర్మకర్త దాసరి బుల్లెమ్మ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అర్చకుడు ఇంకొల్లు మధుబాబు పూజలు చేశారు. ఆలయంలో దాసరి సుబ్బారావు బృందంచే హరేనామనామ సంకీర్తనతో అర్ధ ఏకాహం చేపట్టారు. శనివారం ఉదయం ఆంజనేయునికి సింధురపూజ, తమలపాకులపూజ, మంగళ నీరాజన తీర్థ ప్రసాదాలు పంపిణీ చేపట్టనున్నట్లు కార్యనిర్వహకులు దాసరి నాగరాజు తెలిపారు. వేడుకల్లో గ్రామంతోపాటు పరిసర గ్రామాలలోని భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ దేవస్థానంలో శుక్రవారం రెండో రోజు హనుమజ్జయంతి వేడుకలు దేవస్థాన కార్యనిర్వహణాధికారి తల్లా ప్రగడ సుభద్ర ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం 6 గంటలకు గణపతి పూజ రుత్విగ్వరణము, మహన్యాస పారాయణం, ఏకాదశ మన్ను సూక్త వారాభిషేకం, వేదస్వస్తి, పంచామృతాలు, ఏకదశా విశిష్ట ద్రవ్యాలతో సంపూర్ణాభిషేకంతో పాటు సుందరకాండ పారాయణ, సూర్యనమస్కారాలు సాయంత్రం ప్రదోషకాలమందు లక్ష మల్లెలతో పూజ, నివేదన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, దేవస్థాన సిబ్బంది, ఉభయదాతలు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు పాటించాలి

- 4 ఉదయం 6 గంటలకల్లా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి
- కవ్వింపు చర్యలకు పాల్పడితే చర్యలు
- ఆర్వో సూర్యనారాయణరెడ్డి



ఏజెంట్లు, అభ్యర్థులకు సూచనలందిస్తున్న ఆర్వో సూర్యనారాయణరెడ్డి



సమావేశానికి హాజరైన ఏజెంట్లు, పోలీసు అధికారులు, సిబ్బంది

చీరాల టౌన్: ఈనెల 4న జరిగే సార్వత్రిక ఓట్ల లెక్కింపును పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.. ఓట్ల లెక్కింపు ఏజెంట్లు ఎన్నికల సంఘం నిబంధనలు విధిగా పాటించాలని చీరాల ఆర్డీవో జీ సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, చీఫ్ కౌంటింగ్ ఏజెంట్లు, పోలీసు అధికారులతో కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి ఆర్వో, చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, సీఐలు, ఎస్సైలు, కౌంటింగ్ ఏజెంట్లు, చీఫ్ కౌంటింగ్ ఏజెంట్లు, స్వతంత్ర అభ్యర్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు కవ్వింపు చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓట్లు లెక్కింపు బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతుందన్నారు. పోటీ చేసిన వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, చీఫ్ కౌంటింగ్ ఏజెంట్లు, ఏజెంట్లు సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కౌంటింగ్ కేంద్రానికి తీసుకువస్తారన్నారు. 4 తేదీ ఉదయం 5 గంటల నుంచి 6 గంటలకల్లా అభ్యర్థులు, ఏజెంట్లు, చీఫ్ ఏజెంట్లు విధిగా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు.

ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్..

ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. చీరాల అసెంబ్లీ నియోజకవర్గానికి కౌంటింగ్ 16 రౌండ్లలో జరుగుతుందని, 14 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే ఏజెంట్లు విధిగా ఐడీ కార్డు, ఫారం-18 తీసుకుని కౌంటింగ్‌కు హాజరుకావాలన్నారు. లెక్కింపుల్లో సమస్యలుంటే ఆర్వోకు ఫిర్యాదు చేయవచ్చని కౌంటింగ్ ఏజెంట్లు విధిగా నిబంధనలు పాటించాలని సూచించారు. చీరాల డీఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ ఈసీ నిబంధనల ప్రకారం ఈనెల 10 వరకు 144 సెక్షన్, 30 యాక్టు అమలులో ఉంటుందన్నారు. కౌంటింగ్ ముందు రోజు నుంచి 5 తేదీ వరకు ప్రజలందరు ఇళ్లల్లోనే ఉండాలని, ఎలాంటి గొడవలకు పాల్పడవద్దన్నారు. సమావేశంలో ఏఈఆర్వో నాసరయ్య, సీఐలు శేషగిరిరావు, సోమశేఖర్, సత్యనారాయణ, ఎస్సైలు, ఏజెంట్లు పాల్గొన్నారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు

కారంచేడు: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, కౌంటింగ్ సమయంలోను, తరువాత రోజు అయిన గ్రామాల్లో ఎవ్వరూ అసాంఘిక చర్యలకు, కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని ఎస్ఐ కే సురేష్, యద్దనపూడి ఎస్సై జీవి చౌదరి హెచ్చరించారు. శుక్రవారం వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. మండలంలోని అన్ని ప్రాంతాలలో ప్రస్తుతం 144 సెక్షన్ (నలుగురు ఒక్క చోట గుమిగూడి ఉండటం) 30 పోలీస్ యాక్ట్ ప్రకారం పోలీస్ అనుమతి లేనిదే ఎలాంటి ర్యాలీలు, విజయోత్సవాలు చేయకూడదన్నారు. అసాంఘిక , కవ్వింపు చర్యలకు పాల్పడకూడదన్నారు. అలాగే జూన్ 6వ తేదీ వరకు బాటిళ్లలో పెట్రోలు, డీజిల్ విక్రయాలు కూడా చేయకూడదన్నారు. బాణాసంచా విక్రయాలు చేయవద్దన్నారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు కూడా చేయకూడదన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు, రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

శుక్రవారం రాత్రి ఆయన మండలంలోని నాయుడువారిపాలెం, జరుబులవారిపాలెం, కొడవలివారిపాలెం, కేశవరప్పాడు గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. అనుమానాస్పదంగా ఉన్న గడ్డి వాముల్లోను ఆయన సోదాలు నిర్వహించారు.

గెలుపు ఎవరిదైనా ప్రశాతంగా ఉండాలి..

యద్దనపూడి (పర్చూరు): ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, అందరూ ప్రజా తీర్పును శిరసా వహించాలని పర్చూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. లెక్కింపు కేంద్రంలో ఎన్నికల ఏజెంట్లు అనుసరించాల్సిన నియమావళిని వారికి వివరించారు. కౌటింగ్ సందర్భంగా ఎవరూ ఆక్రోశాలకు పోవద్దని, లెక్కింపు కేంద్రంలో ప్రశాంత వాతావరణం కల్పించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు నిర్ణయించటానికే ఎన్నికలు నిర్వహించారని విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఏజెంట్లు ఎవరు బయటకు రావద్దని సూచించారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ, పర్చూరు సీఐ సీతారామయ్య, ఏఆర్‌ఓలు సుబ్బయ్య, సంధ్యశ్రీ, మెహర్ బాబు, ప్రమీలా, నాగరాజు, ఫణీంద్రబాబు, పర్చూరు ఎస్సై రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే విజయం తథ్యం



ముగింపు కార్యక్రమంలో యాజమాన్యం, శిక్షణ పొందిన అభ్యర్థులు

చీరాల రూరల్: కృషి, పట్టుదల, శ్రమశిక్షణతో చదివితే విజయం వరిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కాలేజి ఆధ్వర్యంలో గత నెల రోజులుగా కాలేజి ప్రాంగణంలో నిర్వహిస్తున్న గ్రూప్-2 మెయిన్స్ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాలేజి కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్ పాల్గొని మాట్లాడారు. అభ్యర్థులు తీసుకున్న ఉచిత శిక్షణా తరగతులు భవిష్యత్తులో కూడా ఏ కాంపిటేటివ్ పరిక్షలకు హాజరైనా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కాలేజి ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు మాట్లాడుతూ నేర్చుకున్న ప్రతి విషయం ఎప్పటికి వృథా కాదని, ప్రతి విద్యార్థి నిరంతరం చదువుతుండాలని, అప్పుడే పోటీ ప్రపంచంలో మనగలుతారని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డు లైబ్రేరియన్ పుల్లగూర బాబురావు, గ్రూప్-1 అధికారి రాయుడు రవికుమార్, రమేష్, కాలేజి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు



కల్యాణ వేడుకలకు హాజరైన భక్తులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని కృష్ణంరాజువారిపాలెం గ్రామంలో కొలువైయున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. 20వ వార్షిక తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన రథోత్సవ కార్యక్రమం వీక్షకులకు ఆనందాన్ని కలిగించింది. ఉదయం గణపతి పూజతో ప్రారంభించి, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అష్టోత్రాలు, సహస్ర నామావళి కార్యక్రమాల అనంతరం స్వామివార్ల కల్యాణం నిర్వహించారు. కల్యాణ వేడుకలను వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు.

ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు అవసరం



ఇంటిదగ్గర రోగికి వైద్యం చేస్తున్న వైద్యులు

బల్లికురవ: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు వేసవి ఎండలు వడగాల్పుల ఉధృతికి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు వహించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు షేక్ రమీజ్ అహ్మద్, పీ భారతి కోరారు. శుక్రవారం మండలంలోని కొణిదెన, వెలమవారిపాలెం గ్రామాల్లో 104 శిబిరాలను నిర్వహించారు. షుగరు, బీపీ హిమోగ్లోబిన్ పరీక్షలతో ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సాయంత్రం శిబిరానికి రాలేని వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారింటికి వెళ్లి పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా చర్మవ్యాధులు సోకే ప్రమాదం ఉందని, జాగ్రత్తగా ఉండాని చెప్పారు. సీజనల్‌గా లభించే పండ్లతో పాటు తేలికైన ఆహారం, రోజుకు మూడు నుంచి నాలుగు లీటర్ల మంచినీరు, మజ్జిగ తాగాలని వైద్యాధికారులు చెప్పారు.

ఆంజనేయస్వామికి వెండి గిన్నె బహూకరణ



అభిషేకం గిన్నెని ఏసీ సుభద్రకు అందజేస్తున్న దాత

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానానికి ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం , చిన్న కనుమళ్ల గ్రామానికి చెందిన కాట్రగడ్డ అనిల్ కుమార్ సతీమణి శ్రీవిద్య శుక్రవారం రూ. 1.40 లక్షలు విలువచేసే వెండి అభిషేకం గిన్నె, ఉద్ధరిణి, రూ. 20 వేలు విలువచేసే రెండు ఎయిర్ కూలర్‌లు, రూ. 50 వేలు విలువ చేసే ఏసీ మిషన్‌ను దేవస్థాన కార్యనిర్వహణాధికారి టి. సుభద్రకు అందజేశారు.

వృత్తి నైపుణ్యదారులకు పురస్కారాలు



సన్మాన గ్రహితలతో రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్థానిక గీతామందిరంలో సమాజంలో వివిధ వృత్తుల్లో నైపుణ్యం కలిగిన 10 మందికి పురస్కారాలను ప్రదానం చేశారు. పురస్కార గ్రహితలకు శాలువా, జ్ఞాపిక పూలమాలలతో నూతన వస్త్రాలను అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ, సెక్రటరీ చప్పిడి వీరయ్య, ట్రెజరర్ కొల్లా భువనేశ్వరీ, అసిస్టెంట్ గవర్నర్ లెవీ ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), ఉబ్బా దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరుడి తిరునాళ్లు



అలంకరణలో రామలింగేశ్వరుడు



అలంకరణలో పార్వతీదేవి అమ్మవారు

బల్లికురవ: మండలంలోని కొనిదెన గ్రామంలో వేంచేసి ఉన్న రామలింగేశ్వరస్వామి 14వ వార్షిక తిరునాళ్ల వేడుకలు శుక్రవారం కమనీయంగా, వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గూడూరి మోహన్‌శర్మ బృందంచే స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, పార్వతి అమ్మవారికి కుంకుమ పూజలు గణపతికి అష్టోత్తర పూజలు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు కళ్యాణోత్సవం చేపట్టారు. వేడుకల్లో గ్రామంతో పాడు పరిసర గ్రామాలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ, ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ప్రభలు ఏర్పాటు చేపట్టారు. రాత్రికి గ్రామానికి చెందిన భజన బృందం నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.